
సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



వినతులు ఫుల్
పరిష్కారం నిల్ 8లో



అలరించిన భారత్, యూఎస్ విన్యాసాలు 8లో



కెమెరామెన్
జీబ్రాతో ఆస్ట్రిచ్ 8లో

న్యూస్‌రీల్

ఘనంగా జగదభిరాముని పట్టాభిషేకం



పట్టాభిషిక్తుడైన శ్రీరాముడు

డాబాగార్డెన్స్: నగరంలోని అంబికాబాగ్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముడి పట్టాభిషేకం సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేశారు. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. వేదపండితులు ఎం.భీమశంకరశాస్త్రి, సీహెచ్‌ఎల్‌ఎన్ అవధానులు, కె.వంచముఖి శర్మ, అంబికాబాగ్ దేవాలయ అర్చకుడు పి.వి.బాలసుబ్రహ్మణ్యాచార్యులు ఆధ్వర్యంలో పట్టాభిషేక ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ క్రెడాయ్ చైర్మన్‌గా ధర్మేందర్



విశాఖ సిటీ: రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) విశాఖపట్నం చాప్టర్ 2025–26కు సంబంధించి కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. చైర్మన్‌గా వి.ధర్మేందర్, అధ్యక్షుడిగా ఇ.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీను ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పి.నరసింహారావు, కె.వి.ఆర్.రాజు (రమేష్), జి.కార్తీక్, జాయింట్ సెక్రటరీలుగా గోవింద రాజు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.కృష్ణమోహన్‌రావు, కోశాధికారిగా కె.శ్రీనివాసరావులకు బాధ్యతలు అప్పగించారు. కార్యనిర్వాహక బోర్డు సభ్యులుగా గణపతిరాజు రాజేష్, కిరణ్ కుమార్ రాజన, కె.సత్యనారాయణ, ఎస్.ఎస్.నాగరాజు, ఎం.రంగనాథం నియమితులయ్యారు. క్రెడాయ్‌లో యువత, మహిళల పాత్రను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా యూత్ వింగ్ కో–ఆర్డినేటర్‌గా పవన్ సంక, యూత్ వింగ్ సెక్రటరీగా ఎన్.భరణిధర్, మహిళా వింగ్ కో–ఆర్డినేటర్‌గా భారతి, మహిళా యూత్ వింగ్ సెక్రటరీగా ప్రణతి రెడ్డిలను నియమించారు.

కొలిక్కిరాని చర్చలు

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చలు 15కి వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అంశంపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో సోమవారం జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. ఇప్పటికే తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతోపాటు కొత్తగా తొలగింపు చర్యలు మానుకోవాలని, 45 ఏళ్లు పై బడిన కార్మికులకు వైద్య పరీక్షలు ఆపాలన్న డిమాండ్లను కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు తెలియజేయగా.. ప్రస్తుత పరిస్థితుల్లో కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించక తప్పదని యాజమాన్యం ప్రతినిధులు కచ్చితంగా చెప్పారు. గతంలో జరిగిన చర్చల్లో ఆర్‌ఎల్‌సీ, డీసీఎల్ చెప్పిన సూచనలను యాజమాన్యం పరిగణలోకి తీసుకోకుండా తొలగింపులు చేసుకుంటూ పోతుందని కార్మిక సంఘాలు తెలిపాయి. తొలగింపు చర్యలను ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశాయి. యాజమాన్యం ప్రతినిధులు తాము చెప్పిన దానికే కట్టుబడి ఉండటంతో తదుపరి చర్చలను ఈనెల 15కు వాయిదా వేశారు.

గిగ్ వర్కర్లకు ఈశ్రమ్ నమోదు

సీతంపేట: గిగ్ వర్కర్లు, జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్లు ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు అన్నారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు పది రోజుల పాటు ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరి బాయ్స్, కొరియర్ బాయ్స్, లాజిస్టిక్ డెలివరి వర్కర్స్, జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్ ఈశ్రమ్ పోర్టల్‌లో https://eshram.gov.in/indexmain నమోదు చేసుకోవాలని కోరారు. 16 నుంచి 59 ఏళ్లలోపు వారు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని రంగాల్లో పనిచేస్తున్న వారు అర్హులని తెలిపారు.

విధుల్లో చేరిన డీటీవో సుధాకరరావు

మహారాణిపేట: జిల్లా ట్రెజరీ అధికారి(డీటీవో) వై.సుధాకరరావు సోమవారం విధుల్లో చేరారు. సుమారు 120 రోజులుగా సుధాకరరావు సెలవులో ఉన్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీటీవోగా సీతమ్మధార అసిస్టెంట్ జిల్లా ట్రెజరీ అధికారి(ఏటీవో) గోవిందరావు పనిచేశారు.

ఆదాయం ఢమాల్!

కూటమి ప్రభుత్వం వచ్చాక భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు ■ జిల్లాలో పతనమైన స్థిరాస్తి రంగం



2023-24లో లక్ష్యం రూ.1,000 కోట్లు..
ఆదాయం రూ.1,060.03 కోట్లు

2024-25లో లక్ష్యం రూ.1,526 కోట్లు..
ఆదాయం రూ.1,047.74 కోట్లు

భూముల విలువ రెట్టింపు చేసినా లక్ష్యంలో 68% ఆదాయం

విశాఖ సిటీ: స్వీయ ప్రకటిత సంపద సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో స్థిరాస్తి వ్యాపారం పతనమైపోయింది. భూముల క్రయ, విక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఆదాయం పెంచేందుకు భూముల విలువలు రెట్టింపు చేసి ఆస్తుల కొనుగోలుదారుల నడ్డి విరిచినప్పటికీ.. రిజిస్ట్రేషన్ల ఆదాయంలో వృద్ధి నమోదు కాలేదు. అలాగే ప్రభుత్వమిచ్చిన లక్ష్యంలో కూడా 68 శాతానికే పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు శత శాతం పెంచినప్పటికీ.. రూ.12.29 కోట్లు తక్కువ ఆదాయం సమకూరింది.

లక్ష్యంలో వెనుకబాటు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యానికి మించి ఆదాయాన్ని సాధిస్తే.. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కనీసం 75 శాతానికి కూడా చేరుకోలేకపోయింది. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు రూ.1000 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి అనుగుణంగానే రిజిస్ట్రేషన్ల ద్వారా ఆ ఏడాది లక్ష్యానికి మించి రూ.1060.03 కోట్లు ఆర్జించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,526 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు జిల్లాలో ఉన్న 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జనవరి నెలాఖరు నాటికి రూ.716.59 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో భూముల విలువలను రెట్టింపు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూములు విలువను గరిష్ఠంగా 50 నుంచి 100 శాతం పెంచింది. దీంతో జనవరి 30, 31 తేదీల్లోనే 1,534 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.35.6 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి(మార్చి 31వ తేదీ) మొత్తంగా 1047.74 కోట్లు(68.63 శాతం) మాత్రమే సమకూరింది. దీని ప్రకారం లక్ష్యానికి రూ.478.26 కోట్లు దూరంలో ఉండిపోయింది.

సంపద ఆవిరి..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖకు బహుళ జాతి కంపెనీలు క్యూలు కడతాయని ఎన్నికలకు ముందు ఊదరగొట్టారు. ఐటీ, ఐటీయేతర, ఫార్మా, డేటా సెంటర్ల పెట్టుబడుల వరద ముంచెత్తుతుందని చెవులకు చిల్లులు పడేలా బాకాలు ఊదారు. సంపద సృష్టించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మించిన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజల నోట్లో బూర్లు వండేశారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 10 నెలల కాలంలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల సంపద ఆవిరైపోతోంది. అన్ని వ్యాపార రంగాలు తిరోగమన బాట పడుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. మార్కెట్లు డీలా పడిపోయాయి. ఈ ప్రభావం జిల్లాలో స్థిరాస్తి రంగంపై పడింది.

ఎస్‌ఆర్‌వో	2023-24 (రూ.కోట్లు)	2024-25 (రూ.కోట్లు)
భీమిలి	68.38	56.07
విశాఖ(ఆర్‌వో)	252.31	262.09
గాజువాక	112.93	90.61
గోపాలపట్నం	57.16	50.91
ద్వారకానగర్	109.14	111.80
మధురవాడ	237.89	249.87
ఆనందపురం	58.78	62.75
పెదగంట్యాడ	90.07	87.33
పెందుర్తి	73.37	76.30
మొత్తం	1060.03	1047.74

మందగమనంలో స్థిరాస్తి రంగం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థిరాస్తి రంగం పుంజుకుంది. విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించిన తరువాత రియల్ ఎస్టేట్ పరుగులు తీసింది. శివారు ప్రాంతాల్లో సైతం భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో కార్పొరేట్ దిగ్గజ నిర్మాణ సంస్థలు విశాఖలో బహుళ అంతస్తుల గేటెడ్ హౌసింగ్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇంతలో అప్పటి ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కాకుండా అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. న్యాయస్థానాల్లో కేసులు వేశారు. ఆ ప్రభావం స్థిరాస్తి రంగంపై పడింది. అయినప్పటికీ జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా నిర్దేశిత లక్ష్యం రూ.1000 కోట్ల కంటే అధికంగా ఆదాయం రాష్ట్ర ఖజానాకు సమకూరింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. విశాఖ రాజధానిగా అయ్యే అవకాశం లేదని అందరూ భావించడంతో.. రియల్ ఎస్టేట్ పూర్తిగా కుదేలైంది. ప్రస్తుతమున్న ప్రాజెక్టుల్లోనే ఫ్లాట్లు, వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. కొత్తగా వెంచర్లు, నిర్మాణాలకు ఎవరూ సాహసించడం లేదు. దీంతో జిల్లాలో ఆస్తుల క్రయ, విక్రయాలు తగ్గిపోయాయి.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా చిన్నంశెట్టి రాజు

పలువురు అదనపు జిల్లా న్యాయమూర్తులకు బదిలీ



విశాఖ లీగల్: విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా మచిలీపట్నం ఒకటో అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆలపాటి గిరిధర్.. నగరంలోని వ్యాట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు అదనపు జిల్లా జడ్జిలకు బదిలీ జరిగింది. విశాఖ పదో అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా వెళుతున్నారు. అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ విశాఖ జిల్లా పదో అదనపు జిల్లా జడ్జిగా బదిలీపై వస్తున్నారు. నగరంలోని వ్యాట్ ట్రిబునల్ చైర్మన్ జి.గోపి మచిలీపట్నం ఒకటో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. రెండో అదనపు జిల్లా కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి వి.వాణి ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళుతున్నారు. విశాఖలోని 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ కాకినాడలోని ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై వెళుతున్నారు. నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది కాకినాడ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.మంగాకుమారి వస్తున్నారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ బదిలీ



డాబాగార్డెన్స్: జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు డిప్యూటేషన్‌పై టీటీడీ డీఈవోగా విధులు నిర్వహించనున్నారు. జీవీఎంసీలో పబ్లిక్ హెల్త్, రెవెన్యూ విభాగానికి సంబంధించి అదనపు కమిషనర్‌గా ఆయన విధులు నిర్వహించారు.

అప్పన్న కల్యాణం చూతము రారండి

రాత్రి 8.15 నుంచి రథోత్సవం.. 10.30 నుంచి కల్యాణమహోత్సవం



విద్యుత్ కాంతులతో సింహగిరి



పుట్టమన్నును శిరస్సుపై పెట్టుకుని ఆలయంలోకి తీసుకెళ్తున్న స్థానాచార్యులు

సింహాచలం: చైత్ర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై వేంజేసిన శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణమహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరగనుంది. సోమవారం రాత్రి నుంచే కల్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులంతా రుత్విగ్వరణం, ఉత్సవాంగీకారం జరిపి, చక్రపెరుమాళ్లను పల్లకీలో ఉంచి మాడవీధిలో తిరువీధి నిర్వహించారు. తదుపరి పుట్టబంగారు మండపంలో చక్రపెరుమాళ్లను వేంజేపచేశారు. పుట్టమన్ను ఉంచి మృత్సంగ్రహణాన్ని జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పుట్టమన్నుని శిరస్సుపై పెట్టుకుని వేదమంత్రోశ్చరణలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లారు. తదుపరి కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన పాలికల్లో పుట్టమన్నుని వేసి అంకురార్పణను విశేషంగా నిర్వహించారు.

నేటి మధ్యాహ్నం నుంచి కల్యాణ ఘట్టాలు

స్వామివారి కల్యాణోత్సవ ఘట్టాలను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కొట్నాలు ఉత్సవంతో ప్రారంభిస్తారు. సాయంత్రం 6.30 నుంచి ఎదురుసన్నాహోత్సవం జరుపుతారు. అనంతరం స్వామిని, అమ్మవార్లను రథంపై వేంజేపచేసి రాత్రి 8.15గంటల నుంచి సింహగిరి మాడ వీధుల్లో రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 10.30 నుంచి ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఏర్పాటుచేసిన భారీ వేదికపై వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

రథోత్సవానికి సన్నద్ధం

రథోత్సవానికి సంబంధించి సోమవారం రథాన్ని సిద్ధం చేశారు. తొలుత జాలారి పెద్ద, రథసారథి కదిరి లక్ష్మణరావు, దేవస్థానం వైదికులు రథానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్‌బీటీ గేటు దగ్గర నుంచి రాజగోపురం వద్దకు రథాన్ని తెచ్చారు.

దర్శనాలపై ఆంక్షలు

వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే అప్పన్న మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయి. తిరిగి రాత్రి 8.30 నుంచి 10 వరకు దర్శనాలకు అనుమతిస్తారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు, ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, పలువురు మత్స్యకారులు, భక్తులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు

- ఆస్పత్రుల్లో అడ్మిషన్ల బంద్
- బకాయిలు చెల్లించని ప్రభుత్వం

మహారాణిపేట: పేదల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ)పై మొదటి నుంచి కూటమి సర్కార్ సవతి తల్లి ప్రేమను చూపిస్తోంది. ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు హామీలు అమలు చేయకపోగా.. ఉన్న వాటికి తిలోదకాలు పలుకుతోంది. ప్రైవేటు ఆస్పత్రులకు ఇవ్వాల్సిన ఆరోగ్య శ్రీ నిధులు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో పేద ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

పేదలపై కూటమి కత్తి

అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలపై కత్తి కట్టింది. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించడం.. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపి రాష్ట్ర ఖజానాను నింపుకుంటున్న కూటమి ప్రభుత్వం.. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆలోచనతో 2007, ఏప్రిల్ 1న పురుడు పోసుకొని లక్షల మంది పేదల ఆరోగ్యాలను నిలబెడుతున్న ఆరోగ్య శ్రీ పథకంపైనే కాకుండా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌పై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు అందుతున్న ఆరోగ్య శ్రీ సేవలతో పాటు ఉద్యోగ ఆరోగ్య పథకానికి కూడా సోమవారం కొంత వరకు బ్రేకు పడింది.

బకాయిలు చెల్లించకపోవడంతో..

జిల్లాలో 102 ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో కొత్త రోగులను ఎవరినీ అడ్మిట్ చేసుకోలేదు. ఆరోగ్య శ్రీ కార్డులు ఉన్న పేదలు ఈ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందుతున్నారు. అయితే ఈ చికిత్సలకు సంబంధించి ప్రభుత్వం ఆయా ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో సోమవారం నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీలో పలు సేవలను నిలిపివేశారు. సోమవారం పలు ఆస్పత్రుల్లో కొత్తగా వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు కానీ ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసుకోలేదు. ఇలాంటి ఆస్పత్రులను విశాఖలో దాదాపు 27 వరకు గుర్తించారు. బకాయిల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు నిలుపుదల చేశాయి. దీంతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం అందకుండా పోయింది. ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తేనే గానీ ప్రైవేటు ఆస్పత్రులు వైద్యం అందించడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. పేదలు, ప్రభుత్వ ఉద్యోగులకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. 10 నెలల్లోనే విశ్వరూపాన్ని చూపిస్తోంది.

మరణించి.. ఐదుగురి జీవితాల్లో వెలుగునిచ్చి..



ఆశిష్ చౌల్ సింగ్

మహారాణిపేట: మరణించి కూడా ఆ యువకుడు ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. చేతికి అంది వస్తాడనుకున్న బిడ్డ బ్రెయిన్ డెడ్ అవడంతో పుట్టెడు దుఃఖంలో కూడా ఆ కుటుంబం వేరే కుటుంబాల్లో ఆనందం నింపేందుకు నిర్ణయించింది. వివరాలివి.. ఒడిశాలోని సోనాబేడలో ఉంటున్న ఆశిష్ చౌల్ సింగ్(22) ఈ నెల 2న బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు ఎంతగా ప్రయత్నించినా.. రోజురోజుకీ ఆరోగ్యం క్షీణించింది. దీంతో సోమవారం బ్రెయిన్ డెడ్‌గా వైద్య బృందం ప్రకటించింది. ఆ తర్వాత అవయవదానంపై వైద్య బృందం యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులకు అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో విషయాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. యువకుడి నుంచి అవయవాలు సేకరించేందుకు ఆయన అనుమతులు జారీ చేశారు. దీంతో 2 కిడ్నీలు, లివర్, పాంక్రియాస్, స్మాల్ బౌల్ తీశారు. వాటిని జీవన్ దాన్ ప్రొటోకాల్ ప్రకారం సీనియార్టీ ఆధారంగా అర్హులకు కేటాయించారు. అవయవదానంపై అవగాహన కల్పించిన వైద్య బృందానికి, అంగీకరించిన కుటుంబ సభ్యులను రాంబాబు అభినందించారు.

సీనియార్టీ ప్రకారమే జాబితా

- ఏపీఈపీడీసీఎల్ లైన్‌మెన్ పదోన్నతుల్లో తప్పుల దిద్దుబాటు
- పుట్టిన తేదీ ప్రకారం పదోన్నతుల జాబితాపై 'సాక్షి' కథనం
- సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సీఎండీ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్‌లో లైన్‌మెన్ పదోన్నతుల జాబితా రూపకల్పనలో జరిగిన తప్పిదాల దిద్దుబాటుకు అధికారులు ఉపక్రమించారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా పుట్టిన తేదీ ప్రకారం సీనియార్టీ జాబితాను సిద్ధం చేయడంపై 'సాక్షి' కథనంతో ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించారు. సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని సీనియార్టీ జాబితా సిద్ధం చేయాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థల్లో 1,354 జూనియర్ లైన్‌మెన్ పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం అధికారులు లైన్‌మెన్ సీనియార్టీ జాబితాను సిద్ధం చేశారు. సాధారణంగా సర్వీస్‌ను ఆధారంగా చేసుకొని సీనియార్టీని నిర్ణయిస్తారు. కానీ ఇక్కడ సిబ్బంది పుట్టిన తేదీ ఆధారంగా సీనియార్టీ జాబితాను రూపొందించారు. కొంత మంది 15, 20 ఏళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ.. వయసులో చిన్నవారైతే జాబితాలో స్థానం కల్పించలేదు. అలాగే సర్వీస్ ఐదేళ్లే ఉన్నా.. పెద్ద వయస్సు అయితే వారికి జాబితాలో చోటిచ్చారు. దీనిపై కొందరు 2008లో హైకోర్టుకు వెళ్లగా సర్వీస్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని తీర్పునిచ్చింది. అయినా కొందరు అధికారులు అందుకు విరుద్ధంగా లిస్టును తయారు చేశారు. దీనిపై సాక్షి 'కోర్టు ఆదేశించినా.. సర్కారు కినుక' శీర్షికను కథనం ప్రచురించింది. దీంతో ఈ విషయంపై ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ దృష్టి పెట్టారు. సర్వీస్ ప్రకారం సీనియార్టీ జాబితాను సర్కిళ్ల వారీగా రూపొందించాలని అధికారులకు తేల్చి చెప్పారు. దీనిపై సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీ వలలో అవినీతి చేపలు

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జోన్-5 ఉద్యోగులు



ఏసీబీ అధికారులకు చిక్కిన ఉద్యోగులు చంద్రశేఖర్, వెంకటరమణ

కంచరపాలెం: ఏసీబీ అధికారుల వలలో అవినీతి చేపలు చిక్కాయి. జ్ఞానాపురం జోన్–5 జీవీఎంసీ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పబ్లిక్ హెల్త్ విభాగం జనన, మరణ ధ్రువీకరణ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి దండి సత్యసూర్య నాగపూర్ణ చంద్రశేఖర్, ఔట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ ఐరకాల వెంకటరమణలు రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన భాను ప్రకాష్ తండ్రి మర్రిపాలెం రైల్వే ట్రాక్ వద్ద జనవరిలో మృతి చెందాడు. అతని మరణ ధ్రువీకరణ పత్రం కోసం జ్ఞానాపురం జోన్–5 పబ్లిక్ హెల్త్ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి చంద్రశేఖర్, ఔట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ వెంకటరమణలు రూ.40 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.20వేలుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే బాధితుడు భానుప్రకాష్‌కు డబ్బులు ఇవ్వడం ఇష్టం లేకపోవడంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు లంచం డబ్బులను బాధితుని వద్ద నుంచి తీసుకుంటుండగా జోనల్ కార్యాలయంలో అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. అవినీతి నిరోధక (సవరణ) చట్టం–2018 సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసి మంగళవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లంచం ఇవ్వాలని వేధించినట్లయితే సంబంధిత ఏసీబీ అధికారులకు, టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా 9440440057కు తెలియజేయాలని ఆయన కోరారు. దాడుల్లో ఏలూరు రేంజ్ డీఎస్పీ రమ్య, ఇన్‌స్పెక్టర్లు కృష్ణకిషోర్, వెంకట్రావ్, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, సుప్రియ పాల్గొన్నారు.

నావికాదళానికి ముడసర్లోవలో స్థలం కేటాయింపు

డాబాగార్డెన్స్: నావికా దళానికి ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీ స్థలం కేటాయించింది. 104 ఏరియాలో జీవీఎంసీ నిర్మించిన బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణంలో నేవీకి చెందిన 7,102.74 చదరపు మీటర్లు విస్తీర్ణం గల స్థలాన్ని కోల్పోయింది. దానికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీకి చెందిన 2.80 ఎకరాలు(11,340.02 చదరపు మీటర్లు) స్థలాన్ని కేటాయించినట్లు మున్సిపల్ పరిపాలనా పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. వేలాదిగా అర్జీలు వస్తున్నా, వాటిని పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో సమస్యలు పేరుకుపోయి, వేదిక లక్ష్యం నీరుగారిపోతోంది. సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తాగునీటి సమస్యలు, రోడ్ల దుస్థితి, మురుగునీటి వ్యవస్థ లోపాలు, భూ సంబంధిత వివాదాలు, పింఛన్లు మంజూరు కాకపోవడం వంటి అనేక రకాల సమస్యలపై ప్రజలు ఆశతో అర్జీలు పెట్టుకుంటున్నారు. అయితే అర్జీలు పరిష్కారంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. అర్జీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో వేదిక నిర్వహణ కూడా భారంగా మారుతోంది. అర్జీల నమోదు, వాటిని సంబంధిత శాఖలకు పంపడం, పరిష్కార ప్రక్రియను పర్యవేక్షించడం వంటి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో వేదికపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది.

వినతులు ఫుల్ పరిష్కారం నిల్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భారీగా అర్జీలు
- పరిష్కారం అంతంత మాత్రం
- ప్రతివారం పెండింగ్ అర్జీలపై కలెక్టర్ దిశానిర్దేశం





అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన జనం

మహారాణిపేట: జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం భారీ సంఖ్యలో అర్జీలతో నిండిపోయింది. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ కూడా పాల్గొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. పింఛన్లు, భూ వివాదాలు, అక్రమ కట్టడాలు, విద్య, ఇతర వ్యక్తిగత సమస్యలపై వారు అర్జీలు సమర్పించారు. సోమవారం మొత్తం 447 వినతులు రావడం సమస్యల తీవ్రతను తెలియజేస్తోంది. ఇందులో రెవెన్యూ శాఖకు 235, పోలీసు శాఖకు 28, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు 107 అర్జీలు రాగా, ఇతర శాఖలకు సంబంధించి 77 వినతులు అందాయి.

పీజీఆర్ఎస్ పై కలెక్టర్ సమీక్ష

అంతకుముందు, కలెక్టర్ పీజీఆర్ఎస్ పై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. అధికారులు రోజూ కనీసం ఒక గంట సమయం శాఖాపరమైన సమీక్షకు కేటాయించి, వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్న శాఖల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్షించి, వాటిని త్వరగా పరిష్కరించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు.

సమస్యలు విన్న అధికారులు

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విన్నారు. తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి నిర్దిష్ట సమయం నిర్దేశించాలని, జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బతికే ఉన్నా పింఛన్ ఇవ్వండి



నేను బతికే ఉన్నా. పింఛన్ ఇవ్వండి. భర్త చనిపోయాడు. నలుగురు పిల్లలున్నా నన్ను చూసే పరిస్థితి లేదు. రికార్డుల్లో నేను చనిపోయినట్టు ఉంది. ఆధార్ కార్డులో, రేషన్ కార్డు కూడా అలాగే ఉంది. నాకు ఎలాంటి ఆధారం లేదు. బతికున్నవాళ్లను ఎలా చంపేస్తున్నారో అర్థం కావడం లేదు. రికార్డులన్నీ పునః పరిశీలన చేసి పింఛను ఇప్పించండి.

–మళ్ల అప్పలనరసమ్మ, జ్ఞానాపురం

అక్రమ కట్టడాలు తొలగించాలి



చిన్నగంట్యాడలో నా స్థలంలో నిర్మించిన కట్టడాలను తొలగించాలి. 91 గజాల స్థలంలో కొంతభాగాన్ని ఖాళీగా ఉంచడంతో పక్కనే ఉన్న మరో వ్యక్తి నా స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మించాడు.అంతేకాకుండా మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.ఇప్పటికే గాజువాక తహసీల్దార్, జీవీఎంసి జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించాను.

–ఎస్.సులోచన, చిన్న గంట్యాడ

బీసీ కార్పొరేషన్‌లో సీటు ఇప్పించండి



షేక్ షరీఫుద్దీన్‌కు దూదేకుల కోటాలో ప్రభుత్వ వసతి గృహంలో సీటు ఇప్పించాలి. ఆర్థికంగా, సామాజికంగా వెనుక బడిన షేక్ షరీఫుద్దీన్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి. దీనిపై స్పందించి బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంటును ఆదేశించాలి. సోమవారం పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేశాం.

–షేక్ బాజీ, మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి విశాఖ జిల్లాల నూర్ భాష/దుదేకుల ముస్లిం సంక్షేమం సంఘం

మీతో టచ్‌లో ఉంటాం...

సార్ చాలా కాలంగా తిరుగుతున్నా. ఎన్నో సార్లు మీ దృష్టికి మా సమస్య తెచ్చా. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రతి వారం రావడం..లిఖితపూర్వకంగా అర్జీ సమర్పించడం.. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం నుంచి ఫోన్ రావడం..సమస్య పరిష్కారం కోసం మీతో టచ్‌లో ఉంటామని సిబ్బంది చెప్పడం షరా మామూలైంది. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని జోన్–8కి చెందిన ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

సార్ జోన్–3 పరిధిలో అనధికార నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ విషయమై పలు మార్లు మీ దృష్టికి తీసుకొచ్చాం. చూస్తాం... పరిశీలిస్తామంటున్నారు. అయితే ఎక్కడా కూడా అనధికార నిర్మాణాలు..అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడం లేదని జోన్–3 నుంచి ఓ నగర పౌరుడి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జీవీఎంసీ అన్ని జోన్ల నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు ఫిర్యాదీదారులు లబోదిబోమన్నారు.

- అర్జీ ఇచ్చినప్పుడల్లా సచివాలయ సిబ్బంది ఫోన్
- పరిష్కారం మాత్రం శూన్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్లు రమణమూర్తి, సోమన్నారాయణ

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 88 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయ పాత సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్ సోమన్నారాయణతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. జోన్–1 నుంచి మూడు, జోన్–2 నుంచి తొమ్మిది, జోన్–3 నుంచి పదహారు, జోన్–4 నుంచి ఐదు, జోన్–5 నుంచి పదిహేడు, జోన్–6 నుంచి ఎనిమిది, జోన్–8 నుంచి పద్నాలుగు ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి పదహారు ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో వ్యయపరిశీలకుడు సి వాసుదేవరెడ్డి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రధాన సిటీ ప్లానర్ ప్రభాకరరావు, డీసీఆర్ ఎస్ శ్రీనివాసరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై నిశిత పరిశీలన అవసరం



సమస్యలు తెలుసుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: ప్రజాదర్బార్‌కు వచ్చే భూ సంబంధిత సమస్యలపై నిశిత పరిశీలన అవసరమని, న్యాయ బద్ధంగా ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 22 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల సమస్యలు స్వయంగా తెలుసుకొని ఆయా అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఒక సమస్యపై ఫిర్యాదుదారుడు కార్యాలయం చుట్టూ తిరగకూడదని తేల్చి చెప్పారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చాలా కాలం క్రితం నాటి భూసేకరణకు సంబంధించిన ఫిర్యాదులు ప్రస్తుతం వస్తున్నాయని, వాటికి సంబంధించిన అన్ని అంశాలు లోతుగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా వాటర్ వరల్డ్‌లో మునిగి బాలుడి మృతి



రుషి

సీతమ్మధార: పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ ఆక్వావరల్డ్ వాటర్ పార్కు స్విమ్మింగ్ పూల్‌లో మునిగి బాలుడు మృతి చెందాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మురళీనగర్‌కు చెందిన గంగాధర్, కల్పన దంపతులు కుమారుడు రుషి (8) రెండో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం తల్లి కల్పన, మేనత్త పిల్లలతో కలిసి విశ్వనాథ్ పోర్టు స్టేడియంలోని ఆక్వావరల్డ్ పార్కులోకి ఆడుకునేందుకు వెళ్లారు. పెద్దలకు లోపలకు ప్రవేశం లేకపోవడంతో బయట ఉన్నారు. స్విమ్మింగ్‌పూల్‌లో ఆడుకుంటూ రుషి స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో రుషితోపాటు ఉన్న మేనత్త పిల్లలు కల్పనకు సమాచారమిచ్చారు. నిర్వాహకులు బాలుడ్ని ఎస్ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఫోర్త్‌టౌన్ సీఐ ఎ.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన భారత్, యూఎస్ దళాల విన్యాసాలు

బీచ్‌రోడ్డు: ట్రై సర్వీస్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ వ్యాయామం 'టైగర్ ట్రయాంఫ్ 2025'లో భాగంగా భారత్, అమెరికా దళాలు సంయుక్తంగా పర్వత యుద్ధ విన్యాసాలు చేపట్టాయి. ఐఎన్ మార్కోస్, ఐఏఎఫ్ గార్డ్స్ ఐఏఎఫ్ సీ–130, యూఎస్ ఏఎఫ్‌సీ–130ల నుంచి కాంబాట్ ఫ్రీ ఫాల్ జంప్‌లను చేశారు. విన్యాసాల్లో పర్వత శ్రేణి ప్రాంతాల్లో త్రిభుజం, దీర్ఘచతురస్రాకార ఆకృతీకరణలతో వ్యూహాత్మక స్థావరాలను, రోప్ స్లైడర్లను నిర్మించారు. అలాగే పర్వత శ్రేణి వంటి కఠినమైన భూభాగాల్లో యుద్ధం చేయటానికి కీలకమైన రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, స్లైదరింగ్ పద్ధతులలో ఆచరణాత్మక శిక్షణ పొందారు. అలాగే పర్వత ప్రాంతంలో యోగా, మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల మార్పిడిలో భాగంగా గూర్ఖా దళాలు ప్రదర్శించిన సాంప్రదాయ ఖుక్రీ ఆధారిత యుద్ధ నృత్యం 'గూర్ఖా ప్యూరీ'ని భారత సైన్యం ప్రదర్శించింది.

జేఈఈ విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలి

పెందుర్తి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయిన జేఈఈ మెయిన్ సెషన్–2 అభ్యర్థులకు మరో అవకాశం కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు, ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) సంఘం జిల్లా అధ్యక్షుడు కె.అభిలాస్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

4 వేల కేజీల రేషన్ బియ్యం పట్టివేత

బీచ్‌రోడ్డు: అక్రమంగా తరలిస్తున్న 4 వేల కిలో రేషన్ బియ్యాన్ని మూడో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు మద్దిలపాలెం వద్ద మూడో పట్టణ సీఐ పైడయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో పందిమెట్టలో అద్దెకు ఉంటున్న లావేటి పూడిరాజు అనే వ్యక్తి ఒక వ్యాన్‌లో 80 బస్తాల బియ్యాన్ని ఆనందపురం తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో బియ్యంతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కెమెరామెన్ జీబ్రాతో ఆస్ట్రిచ్

నేడు జూకి ఓజీ

చూడప్పా సిద్ధప్పా 'నేను సింహం లాంటోడిని...అది గడ్డం గీసుకోదు...నేను గడ్డం గీసుకుంటాను... మిగతాదంతా సేమ్ టు సేమ్' అన్న మీ డైలాగ్ విని ఎంతో మురిసిపోయాం. మాపై మీకున్న ప్రేమకు ఫిదా అయ్యాం. మీ పంజా సినిమా టైటిల్ చూసి పులులంతా సంబరాలు చేసుకున్నాయి. సింహం పడుకుంది కదా అని చెప్పి జూలుతో జడ వేయకూడదురోయ్... అలాగే పులి పలకరించింది కదా అని పక్కన నిలబడి ఫొటో తీయించకూడదు రోయ్. అంటూ అత్తారింటికి దారేది చిత్రంలో చెప్పిన డైలాగ్‌కు జూలో చప్పట్ల మోత మోగించాం. మా గురించి మీ సినిమాల్లో వాడుకుని రికార్డులు సృష్టించిన మీరు డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి హోదాలో తొలిసారి జూకి వస్తున్నారు. చాలా సంతోషం..అయితే మీరొస్తున్నారని తెలిసి గుండెనిండా ఆవేదనతో సమస్యలు నివేదించడానికి సిద్ధంగా ఉన్నాం. జూలో ఉంటున్నాం కానీ తీరని ఆవేదన అనుభవిస్తున్నాం. మా వేదన తీరుస్తారని, మా కన్నీళ్లు తుడుస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాం. మాట నిలుపుకుంటారా? సినిమా డైలాగ్స్‌తో సరిపెడతారో మీ చేతుల్లోనే ఉంది...

–ఆరిలోవ





సపర్యలు చేసేవారు లేక

మానవ తప్పిదాల వల్ల మేము ఇక్కడ బందీలుగా బతుకుతున్నాం. కనీసం మాకు సరైన సపర్యలు చేసేవారు కూడా లేకపోతే ఎలా? కొందరు యానిమల్ కీపర్లు ఉన్నా, వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీంతో మాకు సరైన సమయంలో ఆహారం పెట్టేవారు లేరు. మా ఆవాసాలను శుభ్రం చేసేవారు కరువయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. తోడు లేక ఒంటరిగా జీవిస్తున్నాం.

మా భవిష్యత్తు ఏంటి నాయకా

ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ జూ పార్కులో మా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే మేము అంతరించిపోవడం ఖాయం. మా జాతులను కాపాడాల్సిన బాధ్యత మీపై లేదా? మమ్మల్ని ఈ దుర్భరమైన పరిస్థితుల నుంచి విముక్తి కలిగించే మార్గం లేదా?

మృత్యువాత పడుతున్నా..

ఒక్కరే డాక్టర్ మాకు వైద్యం చేస్తున్నారు. ఆయన తరుచూ విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇప్పుడు కూడా ఐదేళ్లు సెలవు పెట్టి అమెరికా పోయారు. ఇప్పుడు మమ్మల్ని ఇద్దరు అనుభవంలేని అవుట్‌సోర్సింగ్ వెటర్నరీ వైద్యుల చేతిలో పెట్టేశారు. రెండేళ్లుగా విదేశాల నుంచి తీసుకువచ్చిన అరుదైన మా సంతతి కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. మలేసియా, సింగపూర్ తదితర దేశాల నుంచి తీసుకువచ్చిన ఒక జత జిరాఫీలు, ఒక జీబ్రా మృతి చెందాయి. రెండు జిరాఫీ పిల్లలు మృత్యువాత పడ్డాయి. నెల క్రితం దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇక్కడ జూలో పుట్టిన రెండు సింహం పిల్లల్ని ఇక్కడ అనుభవం లేని యానిమల్ కీపర్లు, వెటర్నరీ వైద్యులు కలసి కట్టుగా పొట్టన పెట్టుకొన్నారు.



ఆవాసాలు నరకంగా ...

ఒకప్పుడు విశాలమైన మా ఆవాసాలు నేడు సంకుచితంగా మారాయి. సరైన నిర్వహణ లేక అవి అపరిశుభ్రంగా తయారయ్యాయి. తాగడానికి స్వచ్ఛమైన నీరు లేదు. ఉండటానికి నీడ లేదు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నరకయాతన అనుభవిస్తున్నాం.

తోడు లేక దిగాలు

ప్రస్తుతం ఇక్కడ మాకున్న సంఖ్య(850), మా ఎన్‌క్లోజర్ల సంఖ్య(80)ను బట్టి కనీసం 100కు పైగా పర్మినెంట్ యానిమల్ కీపర్లు, ఆరుగురు పర్మినెంట్ వెటర్నరీ వైద్యులు ఉంటే మేమంతా ఆరోగ్యంగా ఉండి జూకి వచ్చే సందర్శకులన హుషారుగా పలకరించగలం. మమ్మల్ని కాపాడడానికి జూలో పర్మినెంట్ యానిమల్ కీపర్లు, పర్మినెంట్ వెటర్నరీ వైద్యులను నియమిస్తే సంరక్షణ కలుగుతుందని మా నమ్మకం. 2011 నుంచి తోడుకోసం ఎదురు చూస్తున్న ఖడ్గ మృగం, రెండేళ్ల క్రితం జతగాడిని కోల్పోయిన చింపాంజీ, జీబ్రా, ఏడాదిన్నరగా ఒంటరిగా మిగిలిన ఆస్ట్రిచ్ తదితర మా జాతి జీవాలు తోడు కోసం ఎదురు చూస్తున్నాయి.

కుటుంబంతో సహా ఛాతి ఆస్పత్రి ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

బీచ్‌రోడ్డు: తనకు రావాల్సిన పీఆర్సీ విషయంలో జాప్యం జరగడంతో పెదవాల్తేరులోని ఛాతీ ఆస్పత్రి ఉద్యోగి తన కుటుంబంతో పాటు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఛాతీ ఆస్పత్రిలో తోటమాలిగా పనిచేస్తున్న ఆర్. విజయకు 2018 నుంచి పీఆర్సీ అమలు చేయటం లేదు. తనకు పీఆర్సీ వచ్చేలా చూడాలని ఆస్పత్రిలో సీనియర్ అసిస్టెంట్, అకౌంటెంట్‌కు రూ.50 వేలు లంచం ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ తనకు పీఆర్సీ రాకపోవటంతో సోమవారం తన కుటుంబ సభ్యులతో పాటు ఆస్పత్రి వద్ద కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు, తోటి ఉద్యోగులు వారిని నియంత్రించారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ ప్రయత్నించారు. ఒక కుటుంబం మొత్తం ఆత్మహత్యకు ప్రయత్నించినా పోలీసులకు మాత్రం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవటమే ఇందుకు నిదర్శనం. సీనియర్ అసిస్టెంట్, అకౌంటెంట్‌ను కాపాడేందుకు సూపరింటెండెంట్ సునీల్ చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు మహిళా పారిశుధ్య కార్మికులు మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- పాయకరావుపేట జాతీయ రాహదారిపై ప్రమాదం

డాబాగార్డెన్స్: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ పాయకరావుపేట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖకు చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన పలువురు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు గత శనివారం రాత్రి భద్రాచలం శ్రీరాముని కల్యాణానికి బయలుదేరి వెళ్లారు. రాత్రి 10 గంటలకు విశాఖ నుంచి బయలుదేరిన వీరంతా ఆదివారం ఉదయం 7 గంటలకు భద్రాచలం చేరుకున్నారు. అక్కడి దైవ కార్యక్రమాలు అనంతరం ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుగు పయనమయ్యారు. సోమవారం తెల్లవారుజామున పాయకరావుపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న ప్రైవేటు బస్సును తప్పించబోయి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కోటవీధి థామ్సన్ స్ట్రీట్‌కి చెందిన గుర్రాల రత్నం (జీవీఎంసీ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు), అల్లిపురానికి చెందిన పైడితల్లి (జీవీఎంసీ పారిశుధ్య కార్మికురాలు, రిటైర్డ్) మృతి చెందారు. ఈ ఘటనలో గాయపడ్డ కనకమహాలక్ష్మి, గొంప లిజీ, ఆర్.జి. ప్రవళిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.